నిరుద్యోగులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - కాకినాడ

వికాస ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి వాకలపూడి డిడియుజికెవై సెంటర్‌లో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు వికాసా పీడీ లచ్చారావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 సంవత్సరాలు లోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి వృత్తి నైపుణ్యంపై టు వీలర్ టెక్నీషియన్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు 3 నెలలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీమెటీరియల్ అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24 తేదీలోపు 8328483297, 8978475164 సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవలన్నారు.

సమ్మెలో ఇంజినీరింగ్ కార్మికులు

- 44 రోజులుగా ఆందోళన
- పట్టించుకోని పాలకులు
- చాలీచాలని జీతాలతో కష్టాలపాలు

కాకినాడ వివేకానంద పార్కు వద్ద సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పట్టణాల్లో విస్తీర్ణం పరిధి తక్కువగా ఉన్నప్పటికీ జనాభా ఎక్కువగా ఉంటారు. వాళ్లకు ఆయా అవసరాలను తీర్చేందుకు ఆయా మున్సిపాలిటీల్లో ఇంజినీరింగ్ విభాగంలో సేవలు అందిస్తున్న సిబ్బంది అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకోవాల్సి వస్తోందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ గోడును పట్టించుకోవడం లేదంటూ ఆందోళన చెందుతున్నారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 42 రోజులుగా సమ్మె చేస్తున్నా పాలక పెద్దలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కోరుతున్నారు.

కాకినాడ స్మార్ట్ సిటీలో సుమారు 200 మంది, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు నగర పంచాయతీల్లో దాదాపు 500 మంది టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బంది పని చేస్తున్నారు. వీరంతా విద్యుత్, తాగునీరు సరఫరా, తాగునీటి పథకాల నిర్వహణ తదితర పనులు చేస్తుంటారు. వీరికి నెలకు రూ.13 వేలు వేతనం ఇస్తున్నారు. చాలీచాలని వేతనాలతోనే అనేక ఏళ్లగా కుటుంబ పోషణ సాగిస్తున్నారు.

కష్టంగా కుటుంబ పోషణ

టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందిగా పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు కరువయ్యాయి. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగకపోవడంతో సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే నిత్యావసరాల సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. విద్యుత్ ఛార్జీల భారం ఎక్కువగా ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో కేవలం రూ. 13 వేలతో నెల అంతా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలంటూ ఈ ఉద్యోగులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. కార్మిక చట్టాల ప్రకారం ఇంజినీరింగ్ సిబ్బందికి రూ.29,200, టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 చెల్లించాలని ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నారు. అయినా ప్రభుత్వం కనీసంగానైనా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. గతంలో లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలోనూ, పవన్ కళ్యాణ్ చేపట్టిన వారాహి యాత్రలోనూ తమ సమస్యలను రాష్ట్రవ్యాప్తంగా చెప్పుకోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఉద్యోగులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ హామీల అమలు కోసం పట్టించుకోవడంలేదని ఈ సందర్భంగా పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

44 రోజులుగా కార్మికుల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఉద్యోగులు గత 44 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ఆయా కేంద్రాల వద్ద శిబిరాలను ఏర్పాటు చేసి శాంతియుతంగా నిరాహార దీక్షల్లో పాల్గొంటున్నారు. అయినా ప్రభుత్వం వీరి సమస్యలను పరిష్కరించడంలో కనీసం గానైనా చొరవ చూపడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి

సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం తోపాటు, 15 ఏళ్ల సర్వీసు ఉన్న కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ప్రభుత్వం ప్రకటించిన 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండగ రోజుల్లో సెలవు ఇవ్వాలి. లేదా ఆ రోజులకు వేతనాలైన ప్రకటించాలి. విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందిన వారికి రూ.5 లక్షలు నష్ట పరిహారంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగమివ్వాలి.

- వారా నాగరాజు, ఉద్యోగి, కాకినాడ

సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు

విధుల్లో ఉంటుండగా అనారోగ్యం బారిన పడి శరీరం సహకరించని వారికి, దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వమే వైద్యసేవలందించాలి. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. కార్మికులకు సంక్షేమ పథకాలు, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలి. ఉద్యోగ విరమణ తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రాట్యుటీతో పాటు కనీసం రూ.10 వేలు పింఛను ఇవ్వాలి. లేదా పదవీ విరమణ చేసిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

- కె.ప్రసాద్, వాటర్ సప్లై వర్కర్, కాకినాడ.

ప్రభుత్వం తక్షణమే స్పందించాలి

అరకొర వేతనాలతో కుటుంబాలను పోషించుకుంటున్నాం. గత ప్రభుత్వం మా సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని అందరూ కలిసి ఓట్లు వేశాం. కానీ ఏడాది గడిచినప్పటికీ మమ్మల్ని ప్రస్తుతం ఎవరు పట్టించుకోవడం లేదు.

- కె.అప్పారావు, వీధి లైట్ల వర్కర్, కాకినాడ.

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

పని గంటల పెంపును రద్దు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన పని గంటల పెంపును తక్షణమే రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఎపిఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివుకుల వెంకటరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టియుసి ఎపి, తెలంగాణ రాష్ట్రాల ఆర్గనైజింగ్ సెక్రటరీ తాళ్లూరి రాజు, ఎఐసిసిటియు రాష్ట్ర కన్వీనర్ గొడుగు సత్యనారాయణ, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వల్లూరి రాజబాబు మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో పని గంటలను పెంచుతూ చేసిన నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని, 139 సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని అవహేళన చేస్తూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కార్మికులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. 10 గంటల పని విధానం అమల్లోకి వచ్చిన మొదటి సంవత్సరం 12 లక్షల 50వేల మంది కార్మికుల ఉద్యోగాలు పోయి నిరుద్యోగం రాష్ట్రంలో తాండవిస్తుందని అన్నారు. ఇందుకు వ్యతిరేకంగా ఉద్యోగాల కోసం ఎదురు చూసే నిరుద్యోగులందరూ కార్మికులతో కలిసి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధపడాలని పిలుపునిచ్చారు. మహిళలకు పగటి పూటే రక్షణ కల్పించలేని కూటమి ప్రభుత్వం, శ్రామిక మహిళలను రాత్రి వేళల్లో పనిచేయించడాన్నీ మనుకోవాలన్నారు. అనేక శాస్త్రీయ పరిశోధనలు అధిక పనిగంటలు కార్మికుల పాలిట యమపాశాలని ఘోషిస్తున్నా చంద్రబాబు చెవికి ఎక్కడంలేదని, పారిశ్రామిక మిత్రుల ప్రయోజనాలే కూటమి పెద్దలకు ముఖ్యమని విమర్శించారు. గత 15 సంవత్సరాల నుంచి రాష్ట్రంలో కనీస వేతనాలను సవరించలేదని, తక్షణం సలహా మండలిని నియమించి ధరలకు అనుగుణంగా కనీస వేతనాన్ని రూ.26 వేలు నిర్ణయించి రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం తీసుకువచ్చే నాలుగు లేబర్ కోడ్లను రాష్ట్రంలో అమలు నిలుపుదల చేయకపోతే కార్మిక ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని కూటమి నేతలను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి మలకా రమణ, నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, టి.రాజా, అజయ్‌కుమార్, ఎపిఎంఎస్ఆర్ యు రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు గుబ్బల ఆదినారాయణ, ఎఐటియుసి నాయకులు కెవి.రామయ్య, ఎఐసిసిటియు నాయకులు గుబ్బల నాగేశ్వరరావు, ఐఎన్‌టియుసి నాయకులు బషీర్, వి.సాయి, తదితరులు పాల్గొన్నారు.

దేవిహాసినిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ప్రభుత్వ కళశాలల్లోనే నిష్ణాతులైన అధ్యాపకులు

ప్రజాశక్తి - కాజులూరు

ప్రభుత్వ కళాశాలలోని నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారని ప్రవాస భారతీయులు, జనసేన మండల ఇన్‌ఛార్జ్ అన్యం శ్రీరామచంద్రమూర్తి అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ ఎస్ఎస్.శ్రీనివాస్ అధ్యక్షతన ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ జరిగింది. గత ఏడాది కళాశాల పరీక్షల్లో బాలురు విభాగంలో ప్రభుత్వ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచిన యాళ్ళ సత్య ఈశ్వర్, బాలికల విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన కాదా దేవిహాసినిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఈశ్వర్‌కు ఉచిత సీటు రావడంతో అతనికి నాలుగు సంవత్సరాలు పాటు ఉచిత విద్య అందించడం జరుగుతుందన్నారు. అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు ప్రిన్సిపల్ శ్రీనివాస్ నగదు బహుమతిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రయివేట్ పాఠశాలల అధ్యక్షులు కాదా కోటేశ్వరరావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

21న యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - కాకినాడ

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

ఈ నెల 21న జిల్లా అంతటా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ భావనతో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, తదితర అంశాలపై వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ మాట్లాడారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, జిల్లాలో ఏర్పాట్లు, యోగా ట్రైనర్స్‌కు, యోగా కార్యక్రమంలో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ల పంపిణీ, ఫేజ్-3 యోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవడం వంటి అంశాలపై ఆయన దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య అతిథిగా దేశ ప్రధాని పాల్గొంటున్నారన్నారు. కాకినాడ నగరంలోని నూకలమ్మ గుడి దగ్గర నుంచి మూడు లైట్లు జంక్షన్, దేవాదాయశాఖ కార్యాలయం వరకు 3 వేల మందితో యోగాంధ్రా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. 21న జిల్లా అంతటా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. జిల్లావ్యాపంగా వార్డు, గ్రామ సచివాలయాలు పరిధిలో గుర్తించిన వేదికలలో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు, సాధారణ ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి సుమారు 10.38 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నారన్నారని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ట్రైనర్లుకు, పాల్గొన్నావారికి సర్టిఫికెట్ అఫ్ ఎక్సలెన్స్, పార్టిసిపేట్ సర్టిఫికెట్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలకు సంబంధించి మిగిలిన చివరి రెండు రోజులు సంబంధిత అధికారులు అందరు అప్రమత్తమత్తతో వ్యవహరించి విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కర్, డిఆర్‌ఒ జె.వెంకటరావు, జిల్లా స్థాయి వివిధ శాఖల అధికారులు, ఆయుష్ వైద్య అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - తాళ్ళరేవు

ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, రైతాంగ సమస్యలపై పలువురు ప్రజాప్రతినిధులు గళమెత్తారు. గురువారం ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసి సభ్యులు వ్యవసాయ పని ముట్ల పంపిణీ కార్యక్రమంలో ప్రజాప్రతిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారి ప్రశాంతి వివరణ ఇచ్చారు. అయినా ఎంపిపి సునీతతోపాటు, అధికారులు ప్రజాప్రతినిధుల పట్ల తీరు మార్చుకోవాలని సూచించారు. తాగునీటి సమస్యపై వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్, సభ్యులు రేఖాడి నరసింహమూర్తి, పోతుల రత్నకుమారి, గుత్తుల శ్రీనివాస్, పి.మల్లవరం సర్పంచ్ పంపన రామకృష్ణ సమావేశం దృష్టికి తెచ్చారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ సుకీర్తి వివరణ హామీ ఇచ్చారు. గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎంపిపి సునీత మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో ఎటువంటి సభలు, సమావేశాలు జరిగినా ఎంపిటిసి సభ్యులను ఆహ్వానించాలని అన్నారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇఒపిఆర్‌డి ఇందిరకు సభ్యులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్, ఎంపిడిఒ కె.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇని నిలదీస్తున్న ఎంపిటిసి సభ్యుడు

కార్టూ'నిజం'



యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

ప్రజాశక్తి - యంత్రాంగం



సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పంతం నానాజీ

కాకినాడ రూరల్ యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యపడుతుందని ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. గురువారం రూరల్ మండలం సూర్యారావుపేట ఎన్‌టిఆర్ బీచ్‌లో యోగాంధ్రా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని యోగా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, అందరూ తమ ఆరోగ్యం కోసం యోగా చేసుకొని శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పంతం నానాజీ, మెప్మా పీడీ ప్రియంవద, ఎంపిడిఒతోపాటు, ఆయుష్ శాఖ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. **గొల్లప్రోలు** స్థానిక జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువు జ్యోతుల నాగేశ్వరరావు పరివేక్షణలో యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న, ఉపాధ్యాయులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం యోగాపై శిక్షణా తరగతులు నిర్వహించారు. యోగా గురువు ఖండవిల్లి సూర్యనారాయణ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డి.శ్రీలలిత, డిప్యూటీ ఎంపిడిఒ త్సలికి దొరబాబు, కార్యాలయం ఎఒ ఎం.సత్యనారాయణమూర్తి, కార్యాలయ సిబ్బంది, పంచాయతీల కార్యదర్శిలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. **పిఠాపురం** స్థానిక విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమంలో యోగా విశిష్టతపై అవగాహన కార్యక్రమం జరిందే. పీఠాధిపతి ఉమర్ అలీషా అంతర్జాలం ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కె.రామకృష్ణ, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యులు పేరూరి సూరిబాబు, ఎవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

చెవిలో పువ్వులతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 44వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరంలో ఇంజనీరింగ్ కార్మికులు చెవిలో పువ్వులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు సుంకర నాగేశ్వరరావు మాట్లాడుతూ 44 రోజులుగా తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నప్పటికీ తమకు వేతనాలు పెంచకపోవడం దారుణమన్నారు. తమకు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, ఆకుల రామకృష్ణ, వాకాడ భాస్కర్, సుంకర సత్తిరాజు, ఎం.భద్రరావురావు, పి.శ్రీను, బి.భద్రరావు, జి.నాగేశ్వరరావు, జి.సతీష్, మహాపాతిన అరుణ్‌కుమార్, అయ్యప్పస్వామి, టి.సాయి, ఎస్‌కె.బషీర్ పాల్గొన్నారు.

సూర్యారావు జీవితం అందరికీ ఆదర్శం

ప్రజాశక్తి - పెద్దాపురం

సభలో మాట్లాడుతున్న తులసి మంగతాయారు

ప్రజా గాయకుడు, ప్రజాకవి యాసలపు సూర్యారావు జీవితం అందరికీ ఆదర్శమని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అన్నారు. గురువారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోష్యుల కృష్ణబాబు అధ్యక్షతన జరిగిన సభలో 'సవ్వడి' కవితా సంకలనాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా కవిగా, సాహితీవేత్తగా, ప్రజా నాయకుడిగా సూర్యారావు ఎంతో పేరు తెచ్చుకున్నారని అన్నారు. కౌన్సిలర్‌గా ప్రజల సమస్యలపై నిరంతరం గళమెత్తారని కొనియాడారు. 1985 నుంచి సూర్యారావుతో ఉన్న అనుబంధం, సాహిత్య కార్యక్రమాలు, కవితా సంకలనాలపై ఎస్ఆర్.పృథ్వీ వివరించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు గనారా, చల్లా విశ్వనాథం మాట్లాడుతూ యాసలపు సూర్యారావుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పలువురు కవితా గానం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పూర్వ కార్యదర్శి ప్రభాకర్ వర్మ, ప్రజానాట్యమండలి మండల కార్యదర్శి రొంగల వీర్రాజు, దారపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సభా కార్యక్రమానికి ముందు సూర్యరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

నూతన విద్యుత్ లైన్లు నిర్మాణం నిమిత్తం శుక్రవారం చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చెందుర్తి, వన్నెపూడి కొడవలి, తాటిపర్తి, చినజగ్గంపేట, చేబ్రోలు, దుర్గాడ, మల్లవరం, ఎ.విజయనగరం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజాకవి, సిపిఎం నాయకులు యాసలపు సూర్యారావు 13వ వర్ధంతి సందర్భంగా నేడు యాసలపు సూర్యారావు భవనంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు భవనం కార్యదర్శి సిరపరపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభిస్తారన్నారు. ఈ శిబిరంలో రోటరీ బ్లడ్ బ్యాంక్ నిర్వాకులు సేవలందిస్తారన్నారు. అధిక సంఖ్యలో యువత ఈ శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఐటిఐకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - జగ్గంపేట

ఈ విద్యా సంవత్సరంలో ఐటిఐ చదవాలనుకునే విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ ఎల్ఆర్ఆర్.కృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్‌కు జులై 15వ తేదీ లోపు iti.ap.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకుని ఆ ఫ్రింట్ కాపీని అదే తేదీన వారి ఒరిజినల్, నకలు సర్టిఫికెట్స్‌తో స్థానిక ఐటిఐ వద్ద హాజరై వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9440262266, 8142345444 నెంబర్లను సంప్రదించాలన్నారు.

యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కాజులూరు

ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిడిఒ రాంబాబు కోరారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఇఒపిఆర్‌డి రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద మృతి చెంది ఉన్న అనాథ శవానికి టిడిపి నాయకుడు పాలచర్ల నాగేంద్రచౌదరి ఆర్థిక సాయంతో పంచాయతీ సిబ్బంది గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వచ్చిన సమాచారంతో ఆయన గురువారం అక్కడకు చేరుకుని పూలమాలలు చేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ మృతదేహానికి పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు నిర్వహించారు.

నేరాలు ఘోరాలు

అంతర జిల్లా నేరస్తుల అరెస్టు

ప్రజాశక్తి - అమలాపురం

ఎటిఎంల వద్ద మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర జిల్లా నేరస్తులను గురువారం అమలాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అమలాపురం డిఎస్‌పి టియస్ఆర్‌కె.ప్రసాద్ ఈ కేసుకు సంబంధించి వివరాలు వెల్లడించారు. కొంతమూరుకు చెందిన పల్లా సురేంద్రకుమార్, విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తాడ్డి లక్ష్మణరావు అమలాపురం టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రిపోర్ట్ అయిన పలు ఎటిఎం సెంటర్లలో డబ్బులను తీసుకో వడానికి వచ్చే వారిని ఏదో విధంగా మభ్య పెట్టి వారి పిన్‌ను చూడడం గాని, డబ్బులు తీసుకోవడం రాని వారి వద్ద నుండి పిన్‌ను తెలుసుకొని నిందితుల వద్ద ఉండే నకిలీ ఎటిఎం కార్డును వారికి ఇచ్చి వారి అసలు ఎటిఎం దొంగిలించేవారన్నారు. దానితో వారి అకౌంట్‌లో ఉండే డబ్బులను విత్ డ్రా చేసి చోరీలకు పాల్పడేవారన్నారు. వీరిని గురువారం పోలీసులు అరెస్ట్‌చేశారన్నారు. వారి వద్ద నుంచి అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్ - 7, ముమ్మిడివరం-1, రావులపాలెం-1, నగరం-1, పామర్రు-1, రామచంద్రపురం-1, ఆత్రేయపురం-2, తణుకు-1కు సంబంధించి, 15 కేసులలో మొత్తం రూ.5 లక్షల నగదు, 24 నకిలీ ఎటిఎం కార్డ్‌లను స్వాధీనం చేసుకున్నటు తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.వీరబాబు, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర కుమార్ నేతృత్వంలో అమలాపురం టౌన్ ఎస్ఐ కిషోర్ బాబు, స్టేషన్ సిబ్బంది, క్రైమ్ ఎస్ఐ బాలకృష్ణ, క్రైమ్ సిబ్బంది సహాయంతో సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

సెల్‌ఫోన్ షాప్‌లో భారీ చోరీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పెద్దాపురం రోడ్‌లో జగ్గమ్మాగారి పేటలోని వినాయక మొబైల్ యాక్సిసిరీస్ షాపులో బుధవారం రాత్రి భారీ చోరీ జరిగింది. షాపు షట్టర్ ఎత్తి రూ.8 లక్షల విలువైన మొబైల్ ఫోన్‌లు, కౌంటర్‌లో ఉన్న సుమారు రూ.80 వేలు నగదును గుర్తు తెలియని దొంగలు అపహరించుకుపోయారు. పోలీసులు, షాపు యజమాని జి.సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి 10 గంటల సమయంలో వినాయక మొబైల్ షాప్‌ను మూసి యజమాని వెళ్లిపోయాడు. తిరిగి గురువారం ఉదయమే షాపు తెరిచి ఉన్నట్లు పక్కనే గల పలువురు యజమానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో అతను వచ్చి చూడగా షటర్‌ను వంచి లాక్ తొలగించి పైకిలేపి ఎవరో చోరీకి పాల్పడినట్టు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు చేరుకుని చోరీ జరిగిన విధానాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలను సేకరించారు. డ్వాగ్ స్క్వాడ్‌తో దొంగల ఆచూకి కోసం చర్యలు చేపట్టారు. షాపులో సుమారు రూ. 8 లక్షలు విలువైన సెల్ ఫోన్లు, రూ. 80 వేల నగదు చోరీకి గురియైందని యజమాని సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సిఐ ఎ.కృష్ణభగవాన్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కడియం

కడియం మండలం వేమగిరి జాతీయ రహదారిపై పాయిజన్ దాబా కూడలి వద్ద, స్థానిక కోకోకోలా ఫ్యాక్టరీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించినట్టు కడియం ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బొమ్మూరు వైపు నుంచి రావులపాలెం వైపు వెళుతున్న లారీ అదే దారిలో ప్రయాణిస్తున్న బైకును వెనుక నుంచి ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు ఆయన తెలిపారు. మృతుడు అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన సత్తి శివానందరెడ్డి (43)గా గుర్తించామన్నారు. డ్రైవర్ రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్టు తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

బాధిత కుటుంబాలక కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం మండలం బండారులంక కు చెందిన సీనియర్ టిడిపి కార్యకర్త నల్లా ఈశ్వరికి ఇటీవల జరిగిన అగ్నిప్రమాదం లో ఒళ్లు కాలిపోయింది. ఆమె చికిత్స కోసం సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.50,800 చెక్‌ను ఎంఎల్ఎ ఆనందరావు బాధితురాలు భర్త సత్యానందంకు గురువారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భం గా గ్రామ కమిటీ అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, టిడిపి నాయకులు పెనుమాల ఏడుకొండలు చేనేత సమస్యలు పరిష్కరించాలని, బండారులంక డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి కషి చేయాలని ఎంఎల్ఎ ఆనందరావును కోరారు. ఆయన మాట్లాడు తూ జిల్లా హ్యాండ్లూమ్ అధికారుల సమావేశం బండారులంక లో ఏర్పాటుచేసి సమస్యలను చంద్రబాబు, లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారం చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాశిన చిన్న, కాసిన బాబీ, కొండా రాజు, బల్ల కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి అధినేత వైఎస్.జగన్, అ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని టిడిపి అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు. గురువారం బాబ్జి ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు భయం కలిగించే రీతిలో, అధికారంలోకి వస్తే, చూస్తామంటూ వైసిపి నాయకులు ఫ్లెక్సీలు కడుతున్నారని అన్నారు. గ్రామాల్లో సైతం వైసిపి నేతలు ఇదే ధోరణి అవలంబించాలని ఆ పార్టీ కోరుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలుతో ప్రతిపక్షంలో ఆందోళన పెరుగు తోందన్నారు. కూటమి రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన హామీలను అమలు చేస్తోందన్నారు. అరాచక వాదులకు అడ్డుకట్ట వేసేలా పోలీసు యంత్రాంగం పనిచేయాలని కోరారు.

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి - రామచంద్రపురం

వచ్చే నెల 9న జరిగే రాష్ట్రవ్యాప్త బంద్‌లో భాగంగా ఆశా వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేస్తూ సమ్మె తలపెట్టినట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి దుర్గారావు దొరకు సమ్మె నోటీసు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యుటిఎఫ్ నేత మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

యుటిఎఫ్ నేత శ్రీనివాస్

పట్టణ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఉపాధ్యాయుడు కుడుపూడి శ్రీనివాస్ (50) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. మోటార్ సైకిల్‌పై తన స్వగ్రామం రామచంద్రాపురం మండలం కురజాలపల్లి వెళ్లి వస్తుండగా చింతపల్లి లాకుల వద్ద గురువారం సాయంత్రం ఆరు గంటలకు ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో శ్రీనివాస్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. శ్రీనివాస్ భార్య సామర్లకోట నుంచి పెద్దాపురం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. శ్రీనివాస్ ఆకస్మిక మృతికి యుటిఎఫ్ నాయకులు ఆర్.గణేష్, సైతుల్లా, నాగేశ్వరరావు, రాజు, వీరన్న, జిల్లా పత్రిక బాధ్యులు గిరిధర్, గోపాల్ తదితరులు తీవ్ర సంతాపం వెలిబుచ్చారు. శ్రీనివాస మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యానాం వార్తలు

రావిశాస్త్రి పురస్కారానికి 'దాట్ల' ఎంపిక

ప్రజాశక్తి - యానాం

దాట్ల దేవదానం రాజు

రావిశాస్త్రి లీటరరీ ట్రస్ట్ విశాఖపట్నం ఏటా అందించే ప్రతిష్టాత్మక 'రావిశాస్త్రి సాహిత్య పురస్కారం' 2025 సంవత్సరానికి కవి, కథకుడు దాట్ల దేవదానం రాజు ఎంపికయ్యారు. స్థానికతను జోడించి వైవిధ్యమైన కథలు రచించినందుకు ఈ పురస్కారం అందిస్తున్నామని ట్రస్టు కన్వీనర్ డాక్టర్ డివి.సూర్యారావు తెలిపారు. జూలై 30 తేదీ రాచకొండ విశ్వనాధశాస్త్రి జయంతి రోజున విశాఖ పౌరగ్రంథాలయంలో పురస్కార సభ జరుగుతుందని ప్రకటించారు. సాహిత్య జీవితంలో కథల పట్ల ఇష్టాన్నీ ప్రేమనీ కలిగించిన రావిశాస్త్రి పేరు మీద ఇస్తున్న పురస్కారం ఎంతో సంతోషం కలిగిస్తోందని, అదే వేదిక మీద ఆరవ కథాసంపుటి 'మనిషి లోపలి నీడ' ఆవిష్కరించడం జరుగుతుందని దేవదానం రాజు తెలిపారు. ఈ సందర్భంగా దేవదానంరాజును కవులు పి.విష్ణుమూర్తి, శిఖామణి, వరుగు భాస్కరరెడ్డి, చింతా కొండలరావు, మధునాపంతుల, పొనుగుమట్ల అశోక్‌కుమార్ తదితరులు అభినందించారు.

ఆర్ఎఒ మునిస్వామికి సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - యానాం

యానాం అంబేద్కర్ నగర్ గ్రామంలో నెలకొన్న ఆయా సమస్యల్ని పరిష్కారించాలని పరిపాలనాధికారి మునిస్వామికి ఒక వినతిపత్రం సమర్పించారు. గురువారం పరిపాలనాధికారి కార్యాలయంలో పొనుగుమట్ల విష్ణుమూర్తి, మొలగజ్జల ఆనందరావు, పంతగడ సూర్యనారాయణ, మోకా బాబూరావు, రెయ్యా ప్రసన్నకుమార్, పెట్టా హరి, కె.శాంతి, గెడ్డం రమణమ్మ, గిడ్డి రామానుజమ్మ తదితరులు ఆయనను కలిసి సమస్యలను వివరించారు. ఫ్రెంచ్ సమాదుల నుంచి యానాం పాతవంతెన వరకూ ఏటిగట్టు రోడ్డును విస్తరించాలని కోరారు. గ్రామంలో డ్రెయిన్ల మరమ్మతు పనులు చేపట్టాలని, బుద్ధా పార్కు నిర్వహణ కొరవడిందని, పార్కులో పచ్చదనం రోజు రోజుకు తగ్గిపోతుందని, కనీసం మొక్కలు నాటడం లేదని, అభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన కల్యాణ మండపంలో గ్రామస్థులకు మున్సిపాలిటీ ఎటువంటి రాయితీ ఇవ్వడం లేదన్నారు. మెట్టకూరు శ్మశానవాటికలో సమాదులు నిర్మిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సమస్యలపై అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని పరిపాలనాధికారి హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని ఆందోళన

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరివ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతన బకాయిలను చెల్లించాలని కార్మికులు ఆందోళన చేపట్టారు. గురువారం స్థానిక ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం జెండా స్థంభం వద్ద యానాం పురపాలక ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో కార్మికులు మాట్లాడుతూ జీతాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యమంత్రి రంగస్వామి తమకు ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ నిధులు విడుదల చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల బకాయి వేతనాలు కూడా చెల్లించాలన్నారు. పలు సంఘాల నాయకులు, స్థానిక నాయకులు వారికి సంఘీభావం తెలిపారు.

మహిళలకు చీరలు, దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - యానాం

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పుట్టిన రోజు సందర్భంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సావిత్రి నగర్, గిరియంపేటలో సుమారు 250 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరంకాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద అభిమానులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో కాటంశెట్టి రామ్మూర్తి, మెల్లం చిన్నా, చెక్కల అరుణ్‌కుమార్, రాజబాబు, గణేష్, కోన సూరిబాబు, కోన జయరాజ్, దండుప్రోలు రామకృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

టిడిపి గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

నూతన కమిటీని అభినందిస్తున్న వివేకానంద

మండలంలోని ఇంజరం, సుంకరపాలెం టిడిపి గ్రామ కమిటీలు ఎన్నికయ్యాయి. గురువారం మండల ఎన్నికల పరిశీలకులు, మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద ఆధ్వర్యంలో నాయకులు టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి వెంకటరమణ, మోపూరి వెంకటేశ్వరరావు, నడింపల్లి వినోద్, ఉంగరాల వెంకటేశ్వరరావు ఈ ఎన్నికలను నిర్వహించారు. ఇంజరం గ్రామ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కాట్రు వీరేశ్వరరావు, రేలంగి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా శీలం అర్జునకుమార్ ఎన్నికయ్యారు. సుంకరపాలెం గ్రామ కమిటి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నాగాబత్తుల బాలకృష్ణ, కుడుపూడి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా వంగా వీరబాబు, కోశాధికారిగా మాగాపు రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వేగేశ్న భాస్కరరాజు, ఎం.నాయుడు, ఎ.నాగేశ్వరరావు, ఎం.భైరవ మూర్తి, సిహెచ్. నాగేశ్వరరావు, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యాన వన అధికారిగా సత్యశైలజ

ప్రజాశక్తి - పెద్దాపురం



మండల ఉద్యాన వన అధికారిగా కె.సత్యశైలజ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. పిఠాపురం ఉద్యాన వన అధికారిగా విధులు నిర్వహిస్తూ ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఉద్యాన వన అధికారిగా విధులు నిర్వహించిన ఎన్.సుజాత తుని ఉద్యాన వన అధికారిగా బదిలీ అయ్యారు.

పూడికతీతకు మోక్షం ఎప్పుడో..?

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చెత్తతో పేరుకుపోయిన డ్రెయినేజీ

రుతుపవనాల ప్రభావంతో మండల వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రైతులు ఏరువాక పౌర్ణమి నిర్వహించుకుని సాగుకు సమాయత్తమయ్యారు. కానీ రైతుకు సాగునీరు ఇవ్వాల్సిన అధికారులు, నిర్లక్ష్యం వహిస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో ప్రతి ఏటా ఏప్రిల్, మే నెలల్లో పంట కాలువల్లో పూడికలు తొలగించి, సాగునీరు రైతుకు అందేలా అధికారులు సమాయత్తం అవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు పూడికతీత పనులు నేటికీ చేపట్టలేదు. ఖరీఫ్ సాగుకు సిద్ధపడుతున్న రైతుకు సాగునీరు ఏవిధంగా ఇస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. నీటి యజమాన్య సంఘాలకు ఎన్నికల నిర్వహించి పదవుల్లో ఊరేగుతున్న వారు సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పంట కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల, తుప్పలతో కాలువలు మూసుకుపోయాయి. కొన్నిచోట్ల వ్యాపారస్తులు కాలువులను కంపోస్ట్ యార్డులుగా వినియోగిస్తున్నారు. కొన్నిచోట్ల పంట కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్నిచోట్ల పంట కాలువలను ఆక్రమించి పక్కా గృహాలు నిర్మాణం జరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల్లో పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సికిల్‌సెల్ పట్ల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - కాకినాడ

సికిల్ సెల్ వ్యాధి పట్ల నిర్లక్ష్యం తగదని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి అన్నారు. గురువారం ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆర్ఎంసి పెథాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సికిల్ సెల్ అనేది జన్యుపరమైన రక్త సంబంధిత వ్యాధి అని అన్నారు. ఇందులో రక్తహీనత (అనీమియా), తీవ్రమైన నొప్పులు, అవయవాల పనితీరు ప్రభావిత మవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. చిన్ననాటి నుంచి దీని లక్షణాలు కనిపించవచ్చుని సమయానికి గుర్తించి, క్రమంగా చికిత్స అందితే అనేక సమస్యల నుంచి తప్పించుకోవచ్చున్నారు. సికిల్ సెల్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం బాధలు ఎదురవుతాయన్నారు. రక్త పరీక్షలు, స్క్రీనింగ్ టెస్టులు ద్వారా తొందరగా గుర్తించి, సరైన చికిత్సతో బాధితులకు ఆరోగ్యవంతమైన జీవితం అందించవచ్చున్నారు. జిజిహెచ్‌లో అన్ని రకాల రక్తపరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆర్ఎంసి పెథాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింరింటెండెంట్, ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ఎంపి ఆర్.విఠల్, గైనిక్ హెచ్ఒడి అనురాగమయి మాట్లాడారు. ప్రజల్లో ఆరోగ్యంపై చైతన్యం పెరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గైనిక్ హెచ్ఒడి అనురాగమయి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, పెడియాట్రిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జాన్ విల్‌సన్, పెథాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్యూలా, బ్లడ్ బ్యాంక్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ రాజేశ్వరి, బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శారద, డాక్టర్ శ్రీహరిబాబు, ఐసిహెచ్ఎస్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కుశరాజు, నర్సింగ్ గ్రేడ్-1 సూపరింటెండెంట్ ఎన్.సంధ్యారాణి పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణపై సమీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహశీల్దార్

పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్‌స్టేషన్లో హేతుబద్ధీకరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులు, ప్రాంతాలవారీగా ఓటర్ల జాబితాపై సిబ్బంది పరిశీలించే సమయంలో ఆయా ప్రాంతాలకు చెందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ వాలు తిమ్మాపురం రహదారిలో కొత్తగా నిర్మించిన టిడ్కో కాలనీలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ పోలింగ్ బూతులు ప్రభుత్వ భవనాలలోనే ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో 800 నుంచి 1200 మధ్య మాత్రమే ఓటర్లు ఉండాలన్నారు. ఎక్కువమంది ఓటర్లు ఉంటే మరొక పోలింగ్ బూత్ ఏర్పాటు చేయవలసి ఉంటుంద న్నారు. ఈ సమావేశంలో ఎలక్షన్ డిటి లక్ష్మీకుమారి, టిపిఒ సిహెచ్.ఫణికుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు రంది సత్యనారాయణ, జల్దాని సుబ్రహ్మణ్యం, ఎలక్షన్ ఎఇఆర్ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు మండలంలో రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన రెవెన్యూ ఉద్యోగులను సన్మానిస్తామన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువమంది మోటారు వాహన దారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ సూచించారు. గురువారం కోరంగిలో కైట్ కళాశాల వద్ద పలువురికి హెల్మెట్ ధరించటం పట్ల అవగాహన కల్పించారు. వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. చిన్న నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణాన్ని కోల్పోవడంతోపాటు కుటుంబం వీధిని పడుతుందని ప్రయాణికులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆభరణాల అందజేత

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలో శృంగార వల్లభస్వామికి గురువారం రాజమహేంద్రవరంకు చెందిన నామన పార్వతి 17 గ్రాముల బంగారు నయనాలు, అన్నదానం నిమిత్తం రూ.9 వేలు విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస రావు, అర్చకులు తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - కాకినాడ

పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడలో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ఎంపి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. గురువారం ఈ మేరకు కేంద్ర టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌కు, హ్యాండ్ లూమ్స్ డెవలప్‌మెంట్ కమిషనర్‌కు విడివిడిగా లేఖలు రాశారు. ఈ సందర్భంగా ఎంపి ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉప్పాడ గ్రామంలో చేనేత రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్మెంట్ ప్రోగ్రాంను మంజూరు చేసి దీని ద్వారా రూ. 15 కోట్లు నిధులు విడుదల చేయాలని కోరుతూ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని విజ్ఞప్తి చేసిందని తెలిపారు. ఈ పథకం అమలై నిధులు మంజూరు అయితే ఉప్పాడ గ్రామంలో సుమారు 671 చేనేత కుటుంబాలకు లబ్ధి చేకూరడంతో పాటు, చేనేత కార్మికులు తమ ఉత్పత్తుల మార్కెటింగ్ పరిధి పెంపొందించుకోవడం, కాలానుగుణంగా తమ ఉత్పత్తులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరించుకునేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు రూ.12 కోట్లను త్వరితగతిన ఆమోదించి, తొలి వాయిదాగా రూ.3.5 కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలేశ్వరం మండలం, తిరుమాలి గ్రామానికి చెందిన పిల్లా అన్నయమ్మ, W/o. యేసయ్య అను నాకు సంబంధించిన **P0435086** నెంబరు గల పాస్‌పోర్టును తీసుకుని ది. 15-06-2025వ తేదీన మా ఇంటి దగ్గర నుండి జగ్గంపేట వచ్చి జిరాక్స్ తీయించే క్రమంలో పోయినది. దొరికిన వారు ఈక్రింది నెంబర్‌కు ఫోన్ చేసి ఇవ్వగలరు.

ఫోన్ : 7989545390

ప్రకటన

నా క్లయింటు కాకినాడ, జగన్నాధపురం, రామారావుపేట, కడారివారి వీధి, డో.నెం.61-3-31 వాస్తవ్యులు యిమంది చంద్రరావు గారి కుమారుడు **అచ్యుత శివకుమార్** గారి సంజాయిషీపై యావన్మందికీ తెలియజేయునది ఏమనగా,

ఇందులో చూపబడిన ఆస్తి అనగా కాకినాడ, రామారావుపేట, జగన్నాధపురం, కడారివారి వీధిలో వున్న 199 చ॥గ॥లు (కాని కొలత ప్రకారం 206.50 చ॥గ॥లు)ను కొనుగోలు చేయుటకు నా క్లయింటు నిశ్చయించుకొని యున్నారు. సదరు ఆస్తి ప్రప్రథమంగా యిమంది అచ్చియ్యగారు ది.17-05-1961 (దస్తావేజు నెం.2526/1961) రీత్యా గిడుతూరి అప్పలనరసయ్య గారి వద్ద నుండి క్రియం పొంది తదాది నుండి అనుభవిస్తూ 1978 సం॥లో వారి మరణానంతరం మరియు వారి భార్య అమ్మన్న గారు ది.07-08-1990 మరణానంతరం వారి ముఖ్య వారసులైన యిమంది సాయిబాబు, రంగారావు, బాబూరావు గార్లకు హిందూ వారసత్వ రీత్యా దఖలుపడి దర్మిలా వారు ది.24-04-1991 తేదీన దస్తావేజు నెం.1959/1991 నాలుగు వాటాలు వేసుకొని దర్మిలా అందలి 'ఏ' షేర్ హోల్డరు అయిన యిమంది సాయిబాబు గారు వారి వాటాను అనగా 51 1/3 చ॥గ॥లను పసగాడి రూపవాణి గార్కి ది.06-04-1993 దస్తావేజు నెం.1771/1993 రీత్యా క్రియ దస్తావేజు రీత్యా అమ్మవేయగా దర్మిలా ఇంకా కొంత ఆస్తి సాయిబాబా గార్కి ఉమ్మడి ఆస్తిగా చూపబడిన 'డి' షేరు 55 5/9 చ॥గ॥లు నందు 1/3 షేరు మిగిలియున్నది. సదరు రీత్యా ఆపై వాళ్ళకు దఖలుపడగా దర్మిలా (1) సాయిబాబు, (2) రంగారావు, (3) బాబూరావు మరియు శ్రీమతి పసగాడి రూపవాణి గార్లు కలిసి ది.31-12-2000 సం॥రం తేదీన కాకినాడ పురపాలక సంఘం కమీషనరు వారి వద్ద నుండి BRS No.295/98283 ప్లాను పొంది మూడు పోర్షన్ల G+1 దాబాను నిర్మించి దర్మిలా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ రికార్డులలో డోర్ నెం.61-3-30, 61-3-31/1, 2, 3, R.S.No.90/4A, బ్లాక్ నెం.61, వార్డ్ నెం.26 (అసెస్‌మెంట్ నెం.1060018572, 1060018604, 1060018632, 1060018669) ర్లుగా నమోదు చేయించుకొని యీరోజు వరకు కూడా అనుభవిస్తూ యున్నారు.

కావున సదరు ఆస్తి నా క్లయిటు కొనుగోలుపై ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు, కోర్టు దావాలు వగైరా, తనఖాలు వున్న యెడల యీరోజు లగాయతు వారంరోజుల గడువులోగా డాక్యుమెంటరీ ప్రూఫ్‌తో నిరూపించవలెను. లేనియెడల సదరు పైన చూపిన ఆస్తి నిర్వివాద నిష్పేచీ ఆస్తిగా భావించబడును. తర్వాత జరగబోవునవి ఏవీ నా క్లయింటును బైండు చేయబోవని యిందు మూలముగా తెలియజేయడమైనది.

కాకినాడ
ది.19-06-2025

వేగుళ్ళ వెంకటరమణమూర్తి
అడ్వకేట్, డో.నెం.9-4-4, గాంధీనగర్, కాకినాడ, సెల్: 9866033899

గ్రామపంచాయతి కార్యాలయం, నాగులాపల్లి

టెండరు నోటీసు

రి.క. నెం.2025 — తేది.20-06-2025

కాకినాడ జిల్లా, యు.కొత్తపల్లి మండలం, నాగులాపల్లి గ్రామపంచాయతీకి 2025-26 సంవత్సరమునకు అవసరమగు ఈ క్రింది పేర్కొన్న సేవలు మరియు సరఫరాలకు సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలు చేయు చివరి తేదీ 25-6-2025 మధ్యాహ్నం 3 గంటల వరకూ టెండర్లు స్వీకరించబడి అప్పటికి హాజరులో ఉన్న టెండరుదారుల సమక్షమున ఈ దిగువ సంతకము చేసిన అధికారిచే గానీ, వారి అనుమతి పొందిన వారిచే గానీ పంచాయతీ సీల్డు టెండర్లు తెరువబడును. ఆసక్తి గలవారు టెండరు ధరావత్తు చెల్లించి టెండర్లు దాఖలు చేసుకోవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు. టెండర్లు వాయిదా వేయుటకు గాని, రద్దు చేయుటకు గాని పంచాయతీ కార్యదర్శి వారికి అధికారం కలదు.

వ.నెం.	టెండరు వివరములు	ధరావత్తు
1	పారిశుద్ధ్యం నిమిత్తం 6 మంది స్వీపర్ సేవలు అందించుటకు	రూ.100/-
2	ట్యాంక్ ఆపరేటర్‌గా 1 వ్యక్తి సేవలు	రూ.100/-
3	శానిటరీ మేస్త్రీగా సేవలు అందించుటకు 1 వ్యక్తి	రూ.100/-

గమనిక: నిధుల లభ్యతను బట్టి పేమెంట్లు చెల్లించబడును. అయిటమ్‌లపై అధికారుల అనుమతి లోబడి.

శ్రీమతి వి.గౌరి రాజేశ్వరి
సర్పంచ్, నాగులాపల్లి

సం/- **రెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి**
గ్రామపంచాయతి, నాగులాపల్లి

In the Court of the IV Addl. Dist. Judge, Kakinada
M.V.O.P. 123/2023

Between:
Badireddy Venkata Ramana, S/o. Surya Rao, Hindu, aged 54 years, Private Employee, Resident of D.No. 01-161-2, Kobbari Chettu Peta, Challangi peta (V), Tallarevu Mandal
...Petitioners

AND

1. Dasari Rama Tulasi, W/o. Satyanarayana, Hindu, aged 40 years, Golivari Street, Samalkota Town and Mandal, Owner of Hero Motor Cycle bearing No. AP 39 QW 7362.
...1st Respondent

In the above matter the above Ist Respondent is avoiding to take court summons intentionally so you are here by attend before the Hon'ble Court **on 22-07-2025 at about 10.30 AM** either in person or by Advocate counsil. Otherwise in your absence further proceedings follows.

S.NOOKA RAJU
Advocate for the Petitioner
7-1-27/2, Seshagirirao Street
Ramaraopeta,
Kakinada Kakinada-533004, A.P.
Dt: 12-06-2025 Cell: 9848524409

In the Court of the 3rd Additional District Judge at Kakinada
O.P. No. 276/2022

Between:
Anisetti Venkata Ganesh
...Petitioner

AND

Anisetti Dhanalakshmi @ Bhumula Dhanalakshmi and another
...Respondents

To:
R-1: Anisetti Dhanalakshmi @ Bhumula Dhanalakshmi, W/o. Anisetti Venkata Ganesh, D/o. Bhumula Rambabu, R/o. Block No. 14, SF-6, Rajeev Gruhakalpa, Kakinada Urban Mandal.

పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 03-07-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల పై పిటిషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వెలుగొట్ల శ్రీనివాస్, అడ్వకేట్
కాకినాడ, సెల్: 9989749211

IN THE COURT OF THE III ADDL DISTRICT JUDGE :: NANDYAL

I.A.No.228/2020 IN AS. No. /2020

Cosmos Aluminum Private Limited,
Rep.by its Managing Director,
Tumati Sreenivasa,
Presently Dayana Srinivas
S/o Narasimha Murthy, aged 45 years,
R/o D.No. 2 Anjaneya Nagar, Kakinada
.... **Petitioner**

-VERSUS-

1) Pola Vara Prasad, S/o. Chinna Venkata Guruvaiah, aged 45 years, Hindu, Business, R/o D.No. 25/1672C R.S. Road, Nandyal Town and District.

2) Tumati Sreenivasa Rao, aged 45 years, Managing Director, Cosmos Aluminum Private Limited, Sy.No.190/2A

3) Anne Srinivas Sai Kumar aged 61 years director, Cosmos aluminium private limited Sy.No. 190/2A

4) Anne Sita Maha Lakshmi, aged 50 years, Managing Director, Cosmos aluminium private limited Sy.No. 190/2A.

2 to 4 are above address Kotapadu Village Pedaraya varam (post) Rangampeta Mandal Kakinada East Godavari District.
..... **Respondents**

Notices to 2 to 4 Respondents

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీ పై నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసులు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, sec 5 లిమిటేషన్ కోరి అందు నిమిత్తం 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులను జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దుగా గాని వకీల్ ద్వారా గాని 14-7-2025 తేదీన ఉదయం 10.30 గం.లకు హాజరుఅయి మీ అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతటా పై కోర్టువారు మీ పరోక్షమందు దావ ను పరిష్కరించుదురని యిందుమూలము గా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 14-7-2025

S. ఫణింద్ర నాథ్
పిటిషనర్ పరం అడ్వకేట్,
నంద్యాల

IN THE COURT OF THE III ADDL DISTRICT JUDGE :: NANDYAL

I.A.No.230/2020 IN AS. No. /2020

Cosmos Aluminum Private Limited,
Rep.by its Managing Director,
Tumati Sreenivasa,
Presently Dayana Srinivas
S/o Narasimha Murthy, aged 45 years,
R/o D.No. 2 Anjaneya Nagar, Kakinada
.... **Petitioner**

-VERSUS-

1) Pasupula Sudhakar, S/o. Satyanarayana, aged 45 years, Hindu, Business, R/o Saravana Agencies, Nandyal Town and District.

2) Tumati Sreenivasa Rao, aged 45 years, Managing Director, Cosmos Aluminum Private Limited, Sy.No.190/2A

3) Anne Srinivas Sai Kumar aged 61 years director, Cosmos aluminium private limited Sy.No. 190/2A

4) Anne Sita Maha Lakshmi, aged 50 years, Managing Director, Cosmos aluminium private limited Sy.No. 190/2A.

2 to 4 are above address Kotapadu Village Pedaraya varam (post) Rangampeta Mandal Kakinada East Godavari District.
..... **Respondents**

Notices to 2 to 4 Respondents

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీ పై నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసులు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, sec 5 లిమిటేషన్ కోరి అందు నిమిత్తం 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులను జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దుగా గాని వకీల్ ద్వారా గాని 14-7-2025 తేదీన ఉదయం 10.30 గం.లకు హాజరుఅయి మీ అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతటా పై కోర్టువారు మీ పరోక్షమందు దావ ను పరిష్కరించుదురని యిందుమూలము గా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 14-7-2025

S. ఫణింద్ర నాథ్
పిటిషనర్ పరం అడ్వకేట్,
నంద్యాల

IN THE COURT OF THE III ADDL DISTRICT JUDGE :: NANDYAL

I.A.No.435/2020 IN AS. No. /2020

Cosmos Aluminum Private Limited,
Rep.by its Managing Director,
Tumati Sreenivasa,
Presently Dayana Srinivas
S/o Narasimha Murthy, aged 45 years,
R/o D.No. 2 Anjaneya Nagar, Kakinada
.... **Petitioner**

-VERSUS-

1) Kalva Siva Satyanarayana, S/o. Pullaiah, aged 52 years, Hindu, Business, R/o D.No. 28/203, Nandyal Town and District.

2) Tumati Sreenivasa Rao, aged 45 years, Managing Director, Cosmos Aluminum Private Limited, Sy.No.190/2A

3) Anne Srinivas Sai Kumar aged 61 years director, Cosmos aluminium private limited Sy.No. 190/2A

4) Anne Sita Maha Lakshmi, aged 50 years, Managing Director, Cosmos aluminium private limited Sy.No. 190/2A.

2 to 4 are above address Kotapadu Village Pedaraya varam (post) Rangampeta Mandal Kakinada East Godavari District.
..... **Respondents**

Notices to 2 to 4 Respondents

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన మీ పై నెంబరు పిటిషన్‌ను దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్‌లో 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసులు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, sec 5 లిమిటేషన్ కోరి అందు నిమిత్తం 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా నోటీసులను జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు 2 to 4 రెస్పాండెంట్స్ అయిన మీకు ఏమైనా ఆక్షేపనలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దుగా గాని వకీల్ ద్వారా గాని 14-7-2025 తేదీన ఉదయం 10.30 గం.లకు హాజరుఅయి మీ అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనంతటా పై కోర్టువారు మీ పరోక్షమందు దావ ను పరిష్కరించుదురని యిందుమూలము గా తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా 14-7-2025

S. ఫణింద్ర నాథ్
పిటిషనర్ పరం అడ్వకేట్,
నంద్యాల